
సాక్షి నిర్మల్

బుధవారం । 20 । నవంబర్ । 2024

ఎక్సైజ్ శాఖకు మద్యం బాటిళ్ల అప్పగింత

నిర్మల్‌టౌన్‌: ఎక్సైజ్ శాఖకు నిర్మల్ ఆర్టీసీ అధికారులు మంగళవారం మద్యం బాటిళ్లు అప్పగించారు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వస్తున్న రాజధాని బస్సులో దొరికిన 3 బాటిళ్లను డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖకు అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజశేఖర్ సమక్షంలో అప్పగించారు.



రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వెళ్లే పాత ఎన్‌హెచ్-7 సారంగపూర్ మండలంలో అధ్వానంగా మారింది. గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.5 / 15.1

ఆకాశం నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రి మంచు ఎక్కువగా కురుస్తుంది. ఉష్ణోగ్రత బాగా తగ్గుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

సర్వే సజావుగా నిర్వహించాలి

• డీపీవో శ్రీనివాస్



సర్వేను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: సమగ్ర కుటుంబ సర్వేను సజావుగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కల్లూరులో కొనసాగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించారు. సర్వేకు వెళ్లే ముందు ఇంటి యజమానికి సమాచారం ఇవ్వాలన్నారు. కుటుంబ యజమానులు ఎన్యూమరేటర్లకు సహకరించాలని కోరారు.

ముజ్గి పాఠశాలలో ప్రపంచ టాయిలెట్ డే



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్ రూరల్: ప్రపంచ టాయిలెట్ డే సందర్భంగా మండలంలోని ముజ్గి ఉన్నత పాఠశాల విద్యార్థులకు డీఆర్డీవో విజయలక్ష్మి మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు తప్పకుండా టాయిలెట్‌ను వినియోగించాలని సూచించారు. విద్యార్థులంతా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇంటిని, బడిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన స్వచ్ఛ కార్మికులను శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీడీవో గజానంద్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో తుల రామకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

పెంబి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో రాజేందర్ సూచించారు. పెంబి పీహెచ్‌సీని మంగళవారం సందర్శించారు. యాంటీబయోటిక్ మందులు అవసరం మేరకే ఉపయోగించాలని సూచించారు. అతిగా వాడితే రెసిస్టెన్స్ పవర్ తగ్గిపోయి ఇన్‌ఫెక్షన్లు చుట్టుముడతాయని తెలిపారు. ఈమేరకు రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మీడియా, విస్తరణ అధికారి రవీందర్, డీపీహెచ్‌ఎన్‌వో సాయమ్మ, వైద్యాధికారి శివకుమార్, శాంతన్‌రెడ్డి, ఫార్మసిస్టు శ్రీనివాస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

22న దివ్యాంగుల ఆటల పోటీలు

నిర్మల్‌చైన్‌గేట్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 22న దివ్యాంగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఆసక్తిగల దివ్యాంగులు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. 10 నుంచి 17 ఏళ్లలోపు వారికి జూనియర్స్ విభాగంలో, 18 నుంచి 54 ఏళ్లలోపు వారికి సీనియర్ విభాగంలో ఆటల పోటీలు నిర్వహిస్తామని వివరించారు. పాటల పోటీలో పాల్గొనే దివ్యాంగులు సదరం, ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలన్నారు. ఈ పోటీలలో గెలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. అందులకు రన్నింగ్, షాట్‌పుట్ బేస్, బధిరులకు రన్నింగ్, షాట్‌పుట్, క్యారమ్స్, శారీరక వైకల్యం ఉన్నవారికి షాట్‌పుట్, వీల్‌చైర్/ట్రై సైకిల్ రేస్, క్యారమ్స్, బుద్ధి మాంద్యం గల వారికి రన్నింగ్, షాట్‌పుట్, క్యారం పోటీలు ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు.

మొరం మాయం..

• నాగమ్మ చెరువు, కరిసెల గుట్టను గుల్లచేస్తున్న మాఫియా
• అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణానికి తరలింపు
• అడ్డుకున్న వీడీసీ సభ్యులు.. అయినా తరలింపు ఆపని కాంట్రాక్టర్



మొరంతో రోడ్డు వేయిస్తున్న కాంట్రాక్టర్



నాగమ్మ చెరువు ప్రాంతంలో మొరం తవ్వకాలు చేపడుతున్న కాంట్రాక్టర్

సారంగపూర్: ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో మట్టి తరలించాలన్నా.. గుట్టలను పగలగొట్టాలన్నా.. చెరువులు, కుంటల్లో నీళ్లు ఇతర పనులకు వినియోగించాలన్నా.. అనుమతి తప్పనిసరి. కానీ, సారంగాపూర్ మండలంలో మాత్రం దేనికీ అనుమతి తీసుకోరు. అడిగేవారు లేకపోవడంతో ప్రకృతి సంపదను ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్నారు. జామ్ గ్రామ సమీపంలోని చెరువు, గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలించుకుపోతున్నారు. 'తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత' అన్నట్లుగా ఈ దందా సాగుతోంది.

సారంగాపూర్ మండలం జామ్ గ్రామ సమీపంలో ఉన్న కరిసెలగుట్ట ఒకప్పుడు పండ్ల చెట్లు, పక్షుల కిలకిలా రావాలతో పచ్చగా కళకళలాడేది. పెద్ద పెద్ద ఇప్ప చెట్లు గిరిజనులకు ఉపాధి కల్పించేవి. వన భోజనాలకు గ్రామస్తులు ఈ గుట్టకే వచ్చేవారు. ప్రకృతి అందాలను ఆస్వాదించేవారు. పక్కనే నాగమ్మ చెరువు నుంచి వచ్చే స్వచ్ఛమైన చల్ల గాలితో ఎంతో ఆహ్లాదంగా అనిపించేది. మొరం మాఫియా కన్ను ఈ గుట్టపై పడింది. దీంతో క్రమంగా కరిగిపోతూ కరిసెలగుట్ట కళ తప్పింది. ఇప్పుడు చుట్టూ కందకాలు దర్శనమిస్తున్నాయి. దీంతో కరిసెలగుట్ట కందకాల దిబ్బలా మారిపోయింది. వేసవిలో మొరం మాఫియా చెరువునూ వదలడం లేదు. అనుమతులు లేకుండానే భారీ యంత్రాలతో మట్టిని తరలించుకుపోతోంది. దీంతో చెరువులో గుంతలు బావులను తలపిస్తున్నాయి. నీళ్లు తాగేందుకు వెళ్లే పశువులు ఈ గుంతల్లో పడి మృతిచెందుతున్నాయి. ఈతకు వెళ్లే చిన్నారులు, చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకూ ప్రమాదం పొంచి ఉంది.

నిర్మల్, మహారాష్ట్రలకు తరలింపు....

కొంతమంది రాత్రి సమయాల్లో యథేచ్ఛగా మొరం తవ్వకాలు జరుపుతూ నిర్మల్‌తోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇటు రెవెన్యూ అధికారులుగానీ, అటు మైనింగ్ అధికారులుగానీ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మొరం తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం ఇవ్వగానే వచ్చి చూసి వెళ్లిపోతున్నారు. ఎవరిపైనా చర్యలు తీసుకోవడం లేదు. ఒక్క వాహనాన్ని సీజ్ చేసిన దాఖలాలు లేవు.

వీడీసీ సభ్యులు అడ్డుకున్నా..

తాజాగా జామ్ నుంచి మహావీర్‌తండాకు రోడ్డు వేస్తున్న కాంట్రాక్టరు పెద్దపెద్ద వాహనాల ద్వారా మొరం తరలించుకుపోతున్నాడు. విషయం తెలుసుకున్న జామ్, చిన్నూరు, పెద్దూరు వీడీసీ సభ్యులు తవ్వకాలను అడ్డుకున్నారు. అయినా వినిపించుకోకుండా తవ్వకాలు జరుపుతూనే ఉన్నాడు. మొరం తవ్వకాలకు మైనింగ్, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వానికి ఫీజు చెల్లించాలి. కానీ, ఎలాంటి ఫీజు చెల్లించకుండా, ఎవరి అనుమతి తీసుకోకుండానే మొరం తరలించుకుపోతున్నారు.

ఇష్టానుసారం తవ్వకాలు..

మొరం తవ్వకాలు జరిపితే ఒక క్రమపద్ధతిలో జరపాలి. కానీ నాగమ్మ చెరువులో మాత్రం ఎవరికి తోచిన ప్రాంతంలో వారు తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో చెరువంతా పెద్దపెద్ద గుంతలు, కందకాలే ఉన్నాయి. కరిసెల గుట్టను ఆనుకుని ఉన్న ఎత్తయిన గుట్టను కూడా సగానికి తవ్వేశారంటే మొరం దందా ఏమేరకు సాగుతోందో ఊహించుకోవచ్చు.

చర్యలు తీసుకుంటాం...

కరిసెలగుట్ట వద్ద, నాగమ్మ చెరువు పక్కనే మొరం తవ్వుతున్నారని సమాచారం అందింది. ఆర్‌ఐని పంపించి తవ్వకాలను నిలిపివేయించాం. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరిపితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం కరిసెల గుట్ట అధికారుల పర్యవేక్షణలో ఉంది.

– శ్రీదేవి, తహసీల్దార్, సారంగాపూర్

విస్తృతంగా ప్రజాపాలన విజయోత్సవాలు



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, పాల్గొన్న అధికారులు

• సమన్వయ సమావేశంలో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి యేడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాల కార్యక్రమానికి విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమం నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రజాపాలన కళాయాత్ర చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కళాయాత్ర ప్రతినిధులు ప్రొఫెసర్ అలేఖ్య పుంజల, అంతడుపుల నాగరాజు నేతృత్వంలోని బృందాలు రాష్ట్రమంతా పర్యటిస్తాయని వెల్లడించారు. ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా కళాకారుల బృందం ఈనెల 21న సాంస్కృతిక కార్యక్రమాలను పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సహా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కళాకారులకు తగిన వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని, వేదిక వద్ద అత్యవసర సేవల కోసం వైద్య బృందం అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీపీఆర్వో విష్ణువర్ధన్, సీపీవో జీవరత్నం, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రచారరథం ప్రారంభం

ప్రజాపాలన కళాయాత్ర ప్రచార వాహనాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడాదిపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన వివిధ రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి డిసెంబర్ 7 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ కళాకారుల బృందం పర్యటిస్తుందన్నారు.

'మహా' తీర్పు ఇచ్చేందుకు..



భైంసా నుంచి వెళ్తున్న మహారాష్ట్ర ఓటర్లు

నిర్మల్: 'యా దాదా.. మత్‌దాన్ కరా.. ఆపల్యా మహారాష్ట్రాత్ నివడణుకా ఆహేత్.' అంటూ సొంత రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసేందుకు రావాలంటూ పిలుపు రావడంతోనే మరాఠాలు మహారాష్ట్ర తరలివెళ్లారు. బుధవారం మహారాష్ట్ర ఎన్నికల పోలింగ్ జరుగనుంది. దీంతో మంగళవారం రాత్రి వరకు జిల్లా నుంచి వందలాది ఓటర్లు మహారాష్ట్రలోని స్వస్థలాలకు బయల్దేరి వెళ్లారు. మరాఠాలు విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయ, వ్యాపారాలరీత్యా జిల్లావ్యాప్తంగా మరాఠాలు స్థిరపడ్డారు. సరిహద్దులోని చాలా గ్రామాల్లో ఓటర్లకు తెలంగాణ, మహారాష్ట్రలో రెండుచోట్లా ఓట్లు ఉన్నాయి. ధర్మాబాద్, భోకర్, కిన్వట్ తాలుకాల నుంచి జిల్లాకు వచ్చిన మరా ఠాలకు ఇక్కడ ఓట్లు ఉన్నాయి. వాళ్లు తమ స్వస్థలాల్లోనూ ఓటు హక్కును కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలోనే చాలామంది ఓటేసేందుకు తరలివెళ్లారు.

జోనల్ పోటీల్లో భైంసా బాలికల సత్తా..



పతకాలు సాధించిన విద్యార్థినులతో పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు

• సాంఘిక సంక్షేమ పాఠశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్
• రాష్ట్రస్థాయికి 17 మంది ఎంపిక

భైంసాటౌన్: ఇటీవల నిజామాబాద్ జిల్లా కంజరలో జరిగిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జోనల్ స్థాయి పోటీల్లో భైంసా పట్టణంలోని బాలికల గురుకుల విద్యార్థినులు సత్తా చాటారు. జోనల్ స్థాయిలో 18 పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. 17 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు విద్యార్థినులు, పీఈటీని మంగళవారం అభినందించారు. అండర్-14, 200మీ. పరుగుపందెం, లాంగ్‌జంప్‌లో ఎల్.ఆకాంక్ష మూడోస్థానం, షాట్‌పుట్‌లో ఎం.సంజన (మొదటి), బి.స్నేహిత(రెండోస్థానం), డిస్కస్‌త్రోలో జి.పూజ(రెండో స్థానం) సాధించగా, అండర్-17 చెస్ పోటీలో కె.అనుష్క(మొదటి), షాట్‌పు, 400 మీల పరుగులో కె.అనుశ్రీ(రెండు, మూడు), డిస్కస్‌త్రోలో జయశ్రీ మొదటి బహుమతి పొందారు. అండర్-19, 800 మీ.ల పరుగులో కె.హర్షిత రెండోస్థానంలో నిలిచింది.

రాష్ట్రస్థాయికి ఎంపికైన వారు..

అండర్-14 కబడ్డీలో స్నేహిత, ఖోఖోలో ఎస్.శ్రీనిధి, సీహెచ్.సంధ్య, ఎల్.ఆకాంక్ష, అండర్-17 ఖోఖోలో బి.శరణ్య, అండర్ -19లో జే.ప్రకృతి, అండర్-17 వాలీబాల్‌లో జె.సునయన, అండర్ -19లో బి.తేజ, అథ్లెటిక్స్‌లో కె.అనుష్క, ఎల్.ఆకాంక్ష, ఎం.సంజన, బి.స్నేహిత, జి.పూజ, కె.అనుశ్రీ, పి.జయశ్రీ, కె.అనుశ్రీ, కె.హర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాధిక, సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల జూనియర్ కళాశాల/పాఠశాలకు చెందిన విద్యార్థులు 10వ జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 18న నిజామాబాద్‌లోని కంజర గ్రామంలో నిర్వహించిన టెన్నికాయిట్ అండర్-19 విభాగంలో పాఠశాలకు చెందిన కె నిరోజ, జె.రుచితలు ప్రతిభను కనబర్చి మొదటి బహుమతి సాధించారు. అండర్-17విభాగంలో క్యారమ్ పోటీల్లో కావేరి, గంగోత్రి ద్వితీయ బహుమతి సాధించారు. ఈపోటీల్లో అండర్-19విభాగం నుంచి రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు కె.నిరోజ, జె.రుచితి ఎంపికయ్యారు. కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు సీహెచ్.అపర్ణ ఎంపికైంది. అండర్-19 ఖోఖో పోటీలకు జి.మానస, అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలకు కీర్తన అనే విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాధిక వివరించారు. వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు సీనియర్ వైస్‌ప్రిన్సిపాల్ నిహారిక, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వరూప, పీఈటీ సుస్మిత, పీఈటీ సుప్రియ అభినందించారు.

పర్యవేక్షణ లోపం.. ఆదాయానికి శాపం..!

భైంసాటౌన్ పట్టణంలోని ఓ వర్తకుడికి చెందిన ఎలక్ట్రానిక్ కాంటాకు గతేడాది జూన్ 10న స్టాంపింగ్ చేశారు. ఈ ఏడాది జూన్ 9తో గడువు ముగిసింది. మరోమారు స్టాంపింగ్ చేయాలంటే ద్యూ ఫీ చెల్లించాలి. కానీ, ఓ లైసెన్స్‌డ్ కాంటా రిపేరర్ ద్యూ ఫీ లేకుండానే ఇటీవల కాంటాకు సీల్ వేశాడు. అనంతరం తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి స్టాంపింగ్ వేశారు. గాంధీగంజ్‌లో పలువురు భూసార్ ట్రేడర్లకు చెందిన పలు ఎలక్ట్రానిక్ కాంటాలకు సైతం ఈ ఏడాది జూన్‌లోనే స్టాంపింగ్ గడువు ముగియగా, ద్యూ ఫీ లేకుండా కాంటాలకు స్టాంపింగ్ వేసినట్లు తెలిసింది.



జూన్‌లో గడువు ముగిసిన స్టాంపింగ్ రశీదు



ద్యూ ఫీ లేకుండా ఇటీవల వేసిన స్టాంపింగ్ రశీదు

• జిల్లా తూనికలు కొలతల శాఖలో ఇష్టారాజ్యం
• కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన అధికారులు?
• తనిఖీ లేకుండానే కాంటాలపై స్టాంపింగ్

భైంసాటౌన్: జిల్లా తూనికలు, కొలతల శాఖలో అధికారుల పర్యవేక్షణలోపంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. లైసెన్స్‌డ్ కాంటా రిపేరర్ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం సరైన తనిఖీ చేయకుండానే స్టాంపింగ్ చేస్తున్నారు. ఇదే కాకుండా, ఇన్‌చార్జి బాధ్యతల నెపంతో అధికారులు క్షేత్రస్థాయిలో ఎలక్ట్రానిక్, మానువల్ కాంటాలను సకాలంలో తనిఖీలు చేయడం లేదు. వాటికి స్టాంపింగ్ సైతం సకాలంలో వేయకపోవడంతో తూకాల్లో మోసాలతో ఓ వైపు వినియోగదారులు, రైతులు నష్టపోతుండగా, జాప్యం కారణంగా మరోవైపు కాంటాల యజమానులు జరిమానాలు భరించాల్సి వస్తోంది.

వేల సంఖ్యలో..

జిల్లాలో వేలసంఖ్యలో ఎలక్ట్రానిక్, మాన్యువల్ కాంటలు ఉన్నాయి. పదుల సంఖ్యలో వేబ్రిడ్జిలు, పెట్రోల్ పంపులు ఉన్నాయి. తూనికలు, కొలతల శాఖకు సంబంధించి సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు చేసి వినియోగదారులకు కచ్చితమైన సేవలు అందించాల్సి ఉండగా, జిల్లాకు రెగ్యులర్ అధికారి లేక, ఇన్‌చార్జి బాధ్యతలతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఇష్టారీతిన సర్వీస్ చార్జీ..!

ఇదిలా ఉండగా, గుర్తింపు పొందిన లైసెన్స్‌డ్ కాంటా రిపేరర్ ఇష్టారీతిన సర్వీస్ చార్జీ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో కాంటాకు రూ.1,800 వసూలు చేస్తుండగా, ఇందులో నుంచి శాఖకు ఆన్‌లైన్‌లో రూ.300-400 మాత్రమే చెల్లిస్తూ, మిగిలిన మొత్తం సర్వీస్ చార్జీ కింద తీసుకున్నాడు. ఇలా ప్రభుత్వ శాఖకు మించి ప్రైవేట్ వ్యక్తి సర్వీసు చార్జీ ఎక్కువగా ఉండడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు రుసుం వసూలు చేస్తున్న రిపేరర్లు ఏడాదిలోపు కాంటాకు ఏం జరిగినా మరమ్మతు చేయాలి. కానీ, దుకాణదారులకు ఈ విషయమై అవగాహన లేక స్థానికంగా ఉన్నవారికి డబ్బులు చెల్లించి రిపేర్ చేయించుకుంటున్నారు.

మళ్లీ పరిశీలిస్తా..

స్టాంపింగ్ విషయంలో ఆలస్యమైంది. ద్యూ ఫీ వసూలు విషయంలో ఎలాంటి పొరపాటు లేకుండా చూస్తాం. ఇన్‌చార్జి బాధ్యతలతో పూర్తిస్థాయిలో తనిఖీ చేయలేదు. మరోసారి పరిశీలిస్తాం. పొరపాట్లు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగకుండా చూస్తాం. – భూలక్ష్మి, తూనికలు కొలతల అధికారి.

వైద్య కళాశాలలో వైట్‌కోట్ వేడుక



మెడికల్ కాలేజీలో వైట్‌కోట్ వేడుకలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వైట్‌కోట్ వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ మెడికల్ కాలేజీలో తొలి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులు అకడమిక్ విద్య నుంచి క్లినికల్ విద్యలో ప్రవేశించే క్రమంలో వైట్‌కోట్ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే స్థానిక మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైట్‌కోట్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యవత్తిలో ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ తమ వృత్తికి న్యాయం చేస్తామని మెడికల్ కాలేజీ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జి ల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్‌సింగ్, డాక్టర్ దరహాస, డాక్టర్ దినేష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ కృషి



ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: దేశంలో పేదరిక నిర్మూలనకు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదేశాల మేరకు ఉక్కు మహిళ ఇందిరాగాంధీ 107వ జయంతిని జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు చిన్ను మాట్లాడుతూ ఇందిరాగాంధీ పేదరిక నిర్మూలనకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. ఇందిర స్ఫూర్తితోనే దేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, ఎంపీపీ రామేశ్వరరెడ్డి, దేవరకోట దేవాలయ చైర్మన్ శ్రీనివాస్, నిర్మల్ మండల అధ్యక్షుడు కుంట వేణుగోపాల్, కౌన్సిలర్లు కత్తి నరేందర్, సైండ్ల శ్రీధర్, అజర్, అయ్యన్నగారి పోశెట్టి, కొంతం గణేశ్, నాయకులు సబ కలీమ్, మాజర్, సురేందర్, అర్షద్, నవీద్, శ్యామ్, శ్రీధర్, ఒడ్నం నరేందర్, గుల్లె రాజన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలోపడి యువకుడు మృతి

ఇచ్చోడ(బోథ్): ప్రమాదవశాత్తు బావిలోపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇస్లాంనగర్‌కు చెందిన వెంకటి (21) మంగళవారం తన పత్తిచేనులో పురుగుల మందు స్ప్రే చేస్తుండగా నీటికోసం బావివద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటమునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


వెంకటి మృతదేహం

క్యాన్సర్‌తో విద్యార్థి మృతి

తలమడుగు: పదోతరగతి విద్యార్థి క్యాన్సర్‌తో మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్‌కు చెందిన పులవేని గంగయ్య కుమారుడు చరణ్ (17) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ అని తేలడంతో హైదరాబాద్‌లో చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, పాఠశాల విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మంగళవారం నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చరణ్ (ఫైల్)

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

బెల్లంపల్లి: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ముందు మంగళవారం కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఎండీ జీషాన్, కాసిపేట మండలం ముత్యంపల్లికి చెందిన బాకి గౌతమ్ గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 28 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బెదిరిస్తున్నారని ఫిర్యాదు

బెల్లంపల్లి: పట్టణానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు బ్యాంకు నుంచి తీసుకున్న రుణం చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ప్రతీనెల కిస్తీలు చాలని అడిగితే దుర్భాషలాడుతున్నారని ఐకేపీలో పనిచేస్తున్న 6, 7 వార్డుల ఆర్పీ రజిత ఆరోపించారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యర్థాలు తగులబెట్టొద్దు

మంచిర్యాలఅగ్రికల్చర్: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవీ విద్యుత్ తీగల కింద పంట మిగులును తగులబెట్టొద్దని ఇంజినీర్ డింగారి గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల కింద పంటలు పండించే రైతులు చేనులో మిగిలిన వ్యర్థాలను కాల్చివేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు.

సర్కార్ జాగా.. అమ్మే సెయ్!?

☞ బెల్లంపల్లిలోని షంషీర్‌నగర్ బస్తీలో ఓ వ్యక్తి ఇంటిస్థలం కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తూ ఓ మధ్యవర్తిని ఆశ్రయించాడు. అతను సర్వేనంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసిన స్థలాన్ని చూపించాడు. ఇల్లు కట్టుకునేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదని, రూ.5 లక్షలకే గుంటన్నర భూమి వస్తుందని బేరం కుదిర్చాడు. వెంటనే ధర చెల్లించి తనపరం చేసుకున్నాడు. కానీ అట్టి స్థలం రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేకపోవడంతో కేవలం రూ.100 విలువ కలిగిన బాండ్‌పేపర్‌పై భూమి విక్రయపత్రం రాయించుకున్నాడు.

☞ గురిజాలకు వెళ్లే రహదారిని ఆనుకుని ఎల్లమ్మ గుడి వెనకాల ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం బుధాకలాన్ శివారు సర్వేనంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించింది. అట్టి భూమిపై కన్నేసిన ఓ మహిళ నాలుగు ప్లాట్‌లను ఆక్రమించుకుని ఇద్దరు వ్యక్తులకు గుంటకు రూ.6 లక్షల చొప్పున విక్రయించింది. బాండ్ పేపర్ మీద అగ్రిమెంట్ రాసిచ్చింది. దాని ఆధారంగా కొనుగోలు చేసిన వ్యక్తులు శాశ్వత కట్టడాలు నిర్మించారు. ఇటీవల రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చివేతకు సిద్ధపడటంతో బాధితులు అసలు విషయం వెల్లగక్కారు.

అంతటా భూ దందా..!

మున్సిపాలిటీలో భూదందా అడ్డగోలుగా సాగుతోంది. మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా అన్నింటిలో నిబంధనలకు విరుద్ధంగా భూముల క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. దందాలో కొంతమంది ప్రస్తుత, మాజీ కౌన్సిలర్లు, రాజకీయ నాయకులతో పాటు ఒకరిద్దరు రియల్టర్లు సైతం ఉన్నట్లు వినిపిస్తున్నాయి. కేవలం దస్తావేజుల మీద ఒప్పందం రాసుకుని భూముల విక్రయాలు సాగించడం వారికి లాభసాటి అవుతోంది.

- దర్జాగా కబ్జా చేసిన భూముల విక్రయాలు
- స్టాంప్ పేపర్లపై ఒప్పందాలు
- రిజిస్ట్రేషన్ కావని తెలిసినా ఆగని దందా
- చోద్యం చూస్తున్న అధికారులు

బెల్లంపల్లి: ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీలో 80 శాతానికి పైగా ప్రభుత్వ, సింగరేణి లీజు భూములు ఉండగా పెద్దనపల్లి, కాల్‌టెక్స్, రైల్వేస్టేషన్, గంగారాం నగర్ ప్రాంతాల్లోని కొద్దిపాటి ఎకరాలకు మాత్రమే పట్టాలు ఉన్నాయి. బుధాకలాన్ శివారు సర్వేనంబర్ 170 పరిధిలో ఉన్న ప్రభుత్వ, సింగరేణి లీజు భూములు విక్రయించేందుకు వీలులేదు. కానీ అట్టి భూమిని కబ్జాచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. వారి మోసపూరిత మాటలు నమ్మి సామాన్యులు లక్షల రూపాయలు వెచ్చించి అట్టి భూమిని కొనుగోలు చేసి చట్టపరంగా హక్కులు పొందలేకపోతున్నారు.

రిజిస్ట్రేషన్ చేసే పనిలేదు...

ప్రభుత్వ, సింగరేణి లీజు భూములను రిజిస్ట్రేషన్ చేయడానికి నిబంధనలు వర్తించక పోవడం అక్రమార్కులకు వరంగా మారింది. ఏమాత్రం రిస్క్ లేకుండా ఎంతో తేలికగా విక్రయిస్తున్నారు. ఆ ప్రకారంగా ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా పోతుండగా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరని పరిస్థితులు ఉంటున్నాయి.


Rs. 100 ONE HUNDRED RUPEES ₹. 100 INDIA NON JUDICIAL TELANGANA

ప్రభుత్వ స్థలం కొనుగోలు చేసి రాసుకున్న దస్తావేజు

అసైన్డ్ భూములను కొనుగోలు చేసి...

మున్సిపాలిటీ పరిధిలో చాలామట్టుకు అసైన్డ్ భూములు ఉన్నాయి. ఇవన్నీ కూడా సర్వేనంబర్ 170లో ఉండడం గమనార్హం. రైతులకు లేనిపోని ఆశలు కల్పించి కొందరు చట్ట విరుద్ధంగా కొనుగోలు చేయడం, వాటిని ప్లాట్లుగా మలిచి అమ్మకాలు సాగించడం బెల్లంపల్లిలో సర్వసాధారణమైంది. అట్టి భూములు నాలా కన్వర్షన్ చేయడానికి వీలు లేకుండా పోగా ఆ నిబంధనలేవీ పాటించకుండా అధికారులకు ముడుపులు అందజేసి అటువైపు తొంగిచూడకుండా దందా సాగిస్తున్నారు.

చూసీచూడనట్లుగా వ్యవహరించి...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూములకు పట్టా ఉంటే కానీ ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వడం కుదరదు. అన్నీ సవ్యంగా ఉన్నా ముడుపుల కోసం లేనిపోని నిబంధనలు పెట్టి అడ్డంకులు సృష్టించే అధికారులు ఉన్న ఈ రోజుల్లో అడ్డగోలుగా పక్కా గృహాల నిర్మాణాలు జరుగుతున్నా అడ్డుకోవడానికి సాహసించడం లేదు. అయితే కబ్జా చేసిన భూములను అమ్మకాలు సాగించిన అక్రమార్కులు పిల్లర్‌కో లెక్కకట్టి ముట్టజెప్పుండడంతో ఇళ్ల నిర్మాణాలను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఆ తీరుగా కట్టుకున్న ఇళ్లకు ఇంటినంబర్ కేటాయించి నల్లా, విద్యుత్ కనెక్షన్ పొందడానికి చట్టబద్ధంగా హక్కులు సంక్రమించేలా తోడ్పడుతున్నారు.

బాండ్‌పేపర్ ఒప్పందాలు చెల్లవు



ప్రభుత్వ, అసైన్డ్ భూముల క్రయ విక్రయాలు చట్టవిరుద్ధం. వ్యవసాయానికి వినియోగించే భూములను ప్లాట్లుగా మలిచి అమ్మకాలు చేయడం, రిజిస్ట్రేషన్ కాకుండా కేవలం బాండ్‌పేపర్లపై ఒప్పందం చేసుకోవడం నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. ఏవిధంగా ఒప్పందం చేసుకున్నా ప్రభుత్వ, సింగరేణి భూములు ఎవరి సొంతంకావు. ఎప్పటికైనా ప్రభుత్వ పరం అవుతాయి.

– పి.హరికృష్ణ, ఆర్డీవో, బెల్లంపల్లి

స్మృతివనం పనుల్లో నాణ్యత పాటించాలి


మాట్లాడుతున్న పుర్క బాపురావ్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): స్మృతివనం పనుల్లో నాణ్యత పాటించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లేక గుత్తేదారు ఇష్టారీతిన నాసిరకం పనులు చేస్తున్నారని ఆరోపించారు. డిసెంబర్ 9 లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నా గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి స్మృతి వనం పనుల్లో నాణ్యతతో చేపట్టడంతో పాటు గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పుర్క చిత్రు, నాయకులు సోయం రాందాస్, గేడం భరత్, తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్ అతిగా వాడొద్దు


మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: యాంటీబయాటిక్స్ మందులు అతిగా వాడొద్దని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం రిమ్స్‌లో మెడికోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటీబయాటిక్‌తో కలిగే అనర్థాలను విద్యార్థులు నాటక రూపంతో పాటు ముగ్గులు వేసి ప్రదర్శించారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ అతిగా వాడితే బ్యాక్టీరియా రక్షణ కవచంగా మారుతుందన్నారు. ఒకే మందును పదేపదే వినియోగించవద్దని, వైద్యుల సూచన మేరకు వాడాలని సూచించారు. యాంటిబయాటిక్‌తో కిడ్నీ సమస్య, వినికిడి శక్తి తగ్గడంతో పాటు అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మరణాలు సైతం సంభవిస్తాయన్నారు. అనంతరం యాంటీబయాటిక్ వాడకంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పల్మనాలజీ హెచ్‌వోడీ సందీప్ జాదవ్, ఏఎంఆర్ మేనేజర్ అమర్‌నాథ్, మెడికోలు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడు ఆత్మహత్య

కౌటాల(సిర్పూర్): జీవితంపై విరక్తితో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ముత్తంపేటకు చెందిన దుర్గం గోవింద్(75)కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని కుమారుడు దుర్గం దేవాజీ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి ఒకరు ..

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాల శివారు ప్రాంతంలో మంగళవారం రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన తిప్పరవేణి శ్రీనివాస్ (48) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న రైలు పట్టాల వద్దకు వచ్చి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

నర్సాపూర్(జి): హత్యాయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు. ఎస్సై హన్మాండ్లు, కోర్టు లైజన్ అధికారి ఏఎస్సై డల్లు సింగ్ తెలిపిన వివరాల మేరకు... నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన బైండ్ల భోజన్న గతేడాది మే7న మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కుమారుడి భార్య స్వాతిపై కొడవలితో దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై గీత కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో జడ్జి తీర్పు వెలువరించారు.

ఆటో, లారీ ఢీ..


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

నేరడిగొండ(బోథ్): ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి పత్తి ఏరడానికి వచ్చిన కూలీలు మంగళవారం ఇచ్చోడ నుంచి బోథ్ మండలం కన్గుట్టకు ఆటోలో వెళ్తుండగా బోథ్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న లారీ నేరడిగొండ మండలంలోని చింవోలి సమీపంలో ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న దీపక్, శివదాస్, గణేశ్, ప్రవీణ్, రాజేశ్వర్, చిన్నారి సాయిరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

సెలూన్‌లో షార్ట్‌సర్క్యూట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లెటైవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న సెలూన్ (మంగళిషాపు) షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు ఫైర్ అధికారి భగవాన్‌రెడ్డి తెలిపారు. హమాలివాడకు చెందిన శ్రీగాది శ్రీకాంత్ మంగళవారం సెలవుదినం కావడంతో మూసివేశాడు. మధ్యాహ్నం షాపులోనుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు శ్రీకాంత్‌కు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి మండలం శంకరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న వాగు నుంచి మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి మైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌరీశంకర్ తెలిపారు. కాగా అక్రమంగా ఇసుక తరలించే ఓ ట్రాక్టర్ యజమాని ఫారెస్ట్ అధికారితో వాగ్వాదానికి దిగి ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం.

బాసరలో సామూహిక సత్యనారాయణ వ్రతం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బాసర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అక్షరాభ్యాస మండపంలో ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితులు నవీన్ శర్మ, సత్యనారాయణ పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయం తరపున తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు.

పరిశుభ్రత పాటించేలా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: పిల్లలకు అవగాహన కల్పించి పరిశుభ్రత పాటించేలా చూడాలని జిల్లా వైద్యశాఖ అధికారి హరీశ్‌రాజ్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంఈవోలు, ఉపాధ్యాయులు, మండల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆర్బీఎస్కే వైద్యులు, ఫార్మసిస్టులకు ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా పాఠశాల ఆరోగ్యవిద్యపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో ఎస్.యాదయ్య, జిల్లా వైద్యారోగ్యశాఖ ఉప వైద్యాధికారి అనితతో కలిసి ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పిల్లలకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన మార్పులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీవోటీలు, డీపీహెచ్‌ఎన్ పద్మ, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు , తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెటర్లుగా ఎదగాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రఘుపతి

ఆదిలాబాద్: జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి క్రికెటర్లుగా ఎదగాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు ఉష్కం రఘుపతి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం ఎస్జీఎఫ్ అండర్ –17 క్రికెట్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ క్రీడకు అంతర్జాతీయంగా ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. నిరంతరం శ్రమిస్తేనే గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. చిన్నతనంలోనే గుర్తిస్తే, భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు, రాష్ట్ర పాల్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక


భరత్‌ను అభినందిస్తున్న మేనేజర్

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ బ్యాంక్ సదస్సుకు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ మెయిన్ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ బెజ్జంకి భరత్ ఎంపికైనట్లు బ్యాంకు మేనేజర్ చారి తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో ప్రపంచ దేశాల నుంచి 200 మంది బ్యాంక్ ఉద్యోగులు పాల్గొంటుండగా తెలంగాణ నుంచి భరత్ ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో బ్యాంకింగ్ సంస్కరణలు, సేవలు, సైబర్‌క్రైమ్, డిపాజిట్ కరెన్సీ, ఆన్‌లైన్ పేమెంట్, తదితర అంశాలపై సెమినార్ ఉంటుందన్నారు. మంగళవారం బ్యాంక్‌లో భరత్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు వెంకటేష్, కరుణాకర్ రెడ్డి, సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముథోల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఎం.బాలరాజు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 2 నుంచి 6 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని సన్మానిస్తున్న కలెక్టర్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి బీ.కృష్ణ అండర్–14 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కృష్ణ ఈనెల 16, 17 తేదీల్లో మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. డిసెంబర్ 10 నుంచి 15 వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. సదరు విద్యార్థిని మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, ప్రధానోపాధ్యాయురాలు అనూష, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ భూక్యా రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అడవులు జీవవైవిధ్యానికి నిలయాలు


మాట్లాడుతున్న రేంజ్ అధికారి దయాకర్

వేమనపల్లి: అడవులు జీవవైవిధ్యానికి నిలయాలని కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్ అన్నారు. మంగళవారం దట్టమైన అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమనపల్లి సెక్షన్ దస్నాపూర్ బీట్ పరిధిలో ఐదు కిలోమీటర్ల ట్రాన్స్‌సెక్ట్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. 15 రోజులకోసారి కాలినడకన పెట్రోలింగ్ చేస్తూ కవాతు నిర్వహిస్తామన్నారు. ఈ లైన్ వెంట వివిధ రకాల పక్షులు, సీతాకోకచిలుకల ఉనికిని గుర్తించడం జరిగిందన్నారు. అవి అడవుల్లో జీవించే విధానంపై సిబ్బందితో సమీక్ష జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వోలు రూపేష్, లక్ష్మీనారాయణ, ఎఫ్ఎస్‌వో బేగ్, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ విజయానికి కృషి చేయాలి


స్వామిని సన్మానిస్తున్న ట్రాక్‌మెన్‌లు

మంచిర్యాలక్రైం: యూనియన్ విజయానికి అందరూ కృషి చేయాలని మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శి చిలుక స్వామి అన్నారు. డిసెంబర్‌లో జరుగనున్న ట్రేడ్ యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బెల్లంపల్లి బ్రాంచ్, మంచిర్యాల సెక్షన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకత్వంలో ఇప్పటి వరకు అనేక సమస్యలు పరిష్కరించామన్నారు. ట్రాక్‌మెన్‌లకు 8గంటల పని విధానం, ఓపీఎస్, ఎల్‌డీసీఈ ఓపెన్ టూ ఆల్ వంటి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో జెండా గుర్తుకే ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి సాంబశివుడు, కార్యాలయ సిబ్బంది మంత్రి సాగర్, హరినారాయణ, విజయకుమార్, రాజు, గోపాల్, కల్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సహారా కార్యాలయం ఎదుట నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

మందమర్రిరూరల్: పాలసీ మెచ్యూరిటీ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో బాధితులు మంగళవారం సహారా ఇండియా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తిరుపతిరావు, శ్రీనివాసరావులను నమ్మి రూ.లక్షల్లో డిపాజిట్ చేస్తే రికార్డుల్లో అవకతవకలు ఉన్నాయని, అందుకే మెచ్యూరిటీ కావడంలేదని తప్పుడు సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. సంస్థ జోక్యం చేసుకుని వెంటనే డబ్బులు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిలుక సంజీవ్, శ్రీనివాస్, కుమార్, అజార్, శంకర్, పోచయ్య, రాజం, శ్రీను, ఓదెలు, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. బెల్లంపల్లి, కాసిపేటలో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్టు, పొరుగు సేవల పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకటి నుంచి ఏడో తరగతి స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా స్థానికత నిర్ధారిస్తామన్నారు. 18నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఈ నెల 20 నుంచి 26 వరకు దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో మనోజ్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారితో మనోజ్‌వర్మ

శ్రీరాంపూర్: ట్రేడ్ యూనియన్‌లో యువకుల పాత్ర, కార్మికవర్గ సమస్యలు, హక్కులు, తదితర అంశాలపై ఢిల్లీలో జరుగుతున్న జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో ఎస్సార్పీ 3 గని కార్మికుడు, ఐఎన్టీయూసీ సోషల్ మీడియా ఇన్‌చార్జి కారుకూరి మనోజ్‌వర్మ పాల్గొన్నారు. మంగళవారం ఢిల్లీలోని ఇంటర్నేషనల్ యూనియన్ కాన్ఫిడరేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ నేషనల్ యూత్ వర్క్‌షాప్ జరిగింది. దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు పరిశ్రమల నుంచి యువ ప్రతినిధులు హాజరయ్యారు.